
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 డిసెంబర్ 2022
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





సిఐటియు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పండరి భజన చేస్తున్న విద్యార్థినులు (వార్త 6వ పేజీలో)

'మాండూస్' తీవ్ర రూపం..!

'మాండూస్' తుపాన్ తీవ్ర ప్రభావం చూపుతోంది. చెన్నై, శ్రీహరికోట మధ్య తీరం దాటుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి జిల్లా వ్యాపితంగా పలుచోట్ల ఓ మోస్తరు నుంచి వర్షాలు పడుతున్నాయి. చలిగాలులు తీవ్రంగా వీస్తున్నాయి. మత్స్యకారులను వేటకు వెళ్లొద్దని నిషేధించారు. తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏలాంటి చర్యలైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రజలు సహకరించాలని కోరారు. సముద్ర తీర ప్రాంతంలో పోలీసులు పహారా కాస్తున్నారు. కలెక్టరేట్‌లో 1077 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. మరో 24గంటలు భారీ వర్షాలు ఉండడంతో అన్ని శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు.



- జిల్లాలో భారీ వర్షం
- తీరంలో అలజడి
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- తుపాన్‌పై మంత్రి సమీక్ష
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

తూర్పు బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన మాండూస్ తుఫాన్ కారణంగా జిల్లా వ్యాపితంగా శుక్రవారం నుంచి వర్షాలు పడుతున్నాయి. నెల్లూరు నగరంలో పాటు పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఈ తుపాన్ ప్రభావం మరో 24గంటలు ఉంటుందని తెలియడంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. మంత్రి కాకాణి, కలెక్టర్, ఎస్‌పిలతో పాటు ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వర్షాల వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. పారిశుధ్యం, విద్యుత్, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. విద్యుత్‌శాఖ అధికారులు, విద్యుత్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేశారు. వర్షం, గాలులు ఎక్కువైతే చెట్లు విరిగే ప్రమాదం ఉన్నందున ఆయా ప్రాంతాల్లో సిబ్బందిని తగిన నిమిత్తం నియమించారు. ఎక్కడ విద్యుత్ స్తంభాలు విరిగినా వెంటనే పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా రెండు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, ఒక ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం జిల్లాకు చేరుకుంది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని కలెక్టర్ కోరారు. ఎస్‌పి విజయారావు తన సిబ్బందిని సముద్ర తీర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎవరూ వేటకు వెళ్లకుండా సముద్రపువైపు రాకుండా నిఘా పెట్టారు. నెల్లూరు నగరంలో భారీగా వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య ఇబ్బంది లేకుండా కమిషనర్ హరిత ప్రత్యేక చర్యలు చేపట్టారు. కాలువలు, డ్రెయినేజీ పొంగే ప్రాంతాల్లో సిబ్బందిని నియమించారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జెసిబిలు, జనరేటర్లు సిద్ధంగా ఉంచారు. చెరువుల్లో ఇప్పటికే నీరు ఉండడంతో ప్రస్తుత వర్షాలకు గండ్లు పడే అవకాశం ఉంది. దీన్ని నివారించేందుకు ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పేద ప్రజలకు బియ్యం, నూనె, పప్పు, తదితరాలు ఇవ్వడానికి అందుబాటులో ఉంచారు. కలెక్టర్ జిల్లాలోని తహశీల్దార్లతో సెట్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను గురించి పలు సూచనలు చేశారు. వర్షాలు శని, ఆదివారాల్లో ఇలాగే కొనసాగితే ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అందుకుతగ్గట్టు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



పరిశీలిస్తున్న ఎస్‌పి విజయారావు, తదితరులు

ఈనెల15 జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

చేనేత పరిరక్షణ - జిఎస్‌టి రద్దు చేయాలని, జిల్లాలో ఆప్కో స్థల పరిరక్షణ కోరుతూ నగరంలోని జౌళి శాఖ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆసంఘం జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక గాంధీనగర్ ప్రాంతంలోని ఆప్కో స్థలాలను పరిరక్షించి చేనేత పార్కు ఏర్పాటు చేయాలన్నారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం ప్రతి చేనేత కార్మికునికి వర్తింప చేయాలని, చేనేత అనుబంధ వత్తుల వారికి వర్తింపజేయాలన్నారు.

చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలని, కనీస వేతన చట్టం ప్రస్తుత నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం జిఒ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2017 మార్చి 30న నిలుపుదల చేసిన జీవిత బీమా సౌకర్యాన్ని ఆరోగ్య భీమాను వయస్సుతో నిమిత్తం లేకుండా లక్షకు పెంపుదల చేయాలన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి అంత్యోదయ కార్డులు అందజేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మాదిరి చేనేత కార్మికులకు రూ. 5 లక్షల పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చే సి, చేనేత వస్త్రాపై 20శాతం రిబేట్ కొనసాగించాలన్నారు. సహకార సంఘాలకు చెల్లించాల్సిన ఆప్కో బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, స్కూలు పిల్లలకు ప్రభుత్వ ఇస్తున్న వస్త్రాలు చేనేత సహకార సంఘాల ద్వారా అందజేయాలన్నారు. ఇటువంటి సమస్యల సాధనకోసం నిర్వహించే ధర్నా కార్యక్రమంలో చేనేత కార్మికులు, చేనేత శ్రేయోభిలాషులు అందరూ పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో కొత్తగా మంజూరై చేపడుతున్న జాతీయ రహదారులకు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు, రైల్వే, పరిశ్రమల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో భూసేకరణ, అలీనేషన్ తదితర అంశాలపై కలెక్టర్ చక్రధర్ బాబు, జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్ తో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, సంబంధిత ప్రాజెక్టుల ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి డివిజన్ల వారీగా సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు మంజూరైన వివిధ ప్రాజెక్టులకు కావలసిన భూములను సేకరించడంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాజెక్టుకూ సంబందించి నిర్ధిష్టమైన గడువును నిర్ధారించుకొని భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా రెవెన్యూ అధికారులు దష్టి సారించాలన్నారు. వివిధ ప్రాజెక్ట్స్ భూసేకరణకు సంబందించి పెండింగ్‌లోని అనేగ్జర్-11 లను త్వరగా మంజూరయ్యేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాకు మంజూరైన వివిధ ప్రాజెక్టులకు కావలసిన భూములు సేకరించడంతో పాటు అలీనేషన్, అడ్వాన్స్ పొజిషన్ ఇవ్వడంలో చాలా ఆలస్యం అవుతోందని, రెవెన్యూ డివిజనల్ అధికారులు ఇకనైనా ఎటువంటి జాప్యం చేయకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ప్రక్రియను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలన్నారు. నేషనల్ హైవేస్, రైల్వేస్, ఎపిఐఐసి, ఇరిగేషన్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో సంబందిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, సంబందిత ప్రాజెక్టులకు అప్పగించిన భూముల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ, సంబందిత ప్రాజెక్టుల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి ఆయా ప్రాజెక్టులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్.డి.ఒలు మలోల, శీనా నాయక్, కరుణకుమారి, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, సువార్తమ్మ, ఎపిఐఐసి, ఆర్.అండ్ బి., రైల్వే, ఇరిగేషన్ అధికారులు, భూ సేకరణ విభాగం కలెక్టరేట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

అనర్హులైన ఓటరు పేర్లను తొలగించాలి

ప్రజాశక్తి-నెల్లూరు :ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల నమోదులో అనర్హులైన వారి పేర్లను తక్షణమే తొలగించాలంటూ ఎంఎల్‌సి ఎన్నికల కమిటీ కన్వీనర్ ఎం.మోహనరావు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు విద్యాలయాల్లోని మూడు సంవత్సరాల సర్వీస్ నిబంధన లేని జిల్లా విద్యాశాఖ సమగ్రసమాచార పోర్టల్ లో లేని 253 మంది పేర్లను, ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసిటిఈ పోర్టల్ లో నమోదు కాని 472 మంది పేర్లను మొత్తం 725 మంది అనర్హులైన ఓట్లపై విచారణ చేపట్టాలన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారికి సైతం మెయిల్ ద్వారా వినతిపత్రం అందజేశారు. వెంటనే చర్యలు చేపట్టి అనర్హులైన ఓట్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు

వికలాంగులపై అశ్రద్ధ చూపొద్దు

ప్రజాశక్తి-కందుకూరు:వికలాంగుల పట్ల అశ్రద్ధ చూపకూడదని.. భవిత కేంద్రాలకు పంపి వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని సమగ్ర శిక్ష సహిత విద్య జిల్లా సమన్వయకర్త ధనమ్మ తల్లిదండ్రులను కోరారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రం వద్ద సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కందుకూరు డివిజన్ పరిధిలోని కందుకూరు, వలేటివారిపాలెం, గుడ్లూరు, లింగసముద్రం, ఉలవపాడు మండలాలలో గల ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీకై వైకల్య నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధనమ్మ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రానికి క్రమం తప్పకుండా పంపాలన్నారు. ఈ కేంద్రంలో వారానికి ఒక పర్యాయం ఉచితంగా ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగవైకల్యాలను జయించి మేదస్సుతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన కొంతమంది మేధావులు గురించి తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ పి. విజయ శేఖర్ తల్లిదండ్రులకు సూచించారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడుకున్న వైద్య పరీక్షలను ఉచితంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో చేయించడం సంతోషకరమన్నారు. అనంతరం వైద్యులు వైకల్య నిర్ధారణ పరీక్షలలో భాగంగా ప్రధానంగా వినికిడి లోపం, కంటి చూపు, మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వరల్డ్ విజిల్ వారు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో బాలుర హైస్కూల్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఏసుదాసు, ఐదు మండలాల ఐఈ రిసోర్స్ పర్సన్లు, స్థానిక సిఆర్‌పిలు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ ధనమ్మ

కొనసాగుతున్న 'ఇంటూరి' సేవలు

ప్రజాశక్తి-కందుకూరు: తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ తమ పర్యటనలో భాగంగా కందుకూరు మండలం, మోపాడు గ్రామంలో వికలాంగురాలైన అల్లం స్వప్నని పరామర్శించి ట్రై సైకిల్ ఇచ్చి భరోసా నిచ్చారు. కార్యకర్తలు ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే కందుకూరులోని తమ కార్యాలయంలో సంప్రదించవచ్చునని తెలిపారు. అదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఒంగోలు రిమ్స్‌లో వైద్యం చేయించుకుంటున్న మేడికొండ బ్రహ్మం కుటుంబ సభ్యులను కలిసి వారికి వైద్య ఖర్చుల కోసం రూ.10వేలు సహాయం చేశారు. మోపాడు గ్రామ వాసి మాదాల బాబాజీ ఇటీవల చనిపోయారు. గ్రామ నాయకులు, కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఇంటూరి రాజేష్ ఆ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నీడి వెంకటేశ్వర్లు, తోకల వెంకటేశ్వర్లు, రావుల రవి, తోకల నరసింహ, బొడపాటి నారాయణ, చెన్నారెడ్డి ఆదిశేషు, తోకల వీరయ్య, తోట వెంకటేశ్వర్లు, మాపాడు గ్రామ యువత, తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ట్రైసైకిల్ అందజేస్తున్న ఇంటూరి

విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -గుడ్లూరు:మండలంలో అక్రమ విద్యుత్ సౌర్యాలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీరు కెవిజి.సత్యనారాయణ ఆదేశాల మేరకు 17 గ్రామాల్లో తనిఖీలు నిర్వహించామని విద్యుత్ శాఖ అధికారి పి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు అత్తంటి వీరయ్య, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు తోట శ్రీనివాసులు రావు నేతత్వంలో 32 బందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 2162 సర్వీసులను తనిఖీ చేశారు. అక్రమంగా వాడుతున్న మీటర్లపై రూ.1,58,500ల చొప్పున అపరాధ రుసుములు విధించినట్లు తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ సౌర్యం జరిగితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజామణి, విజయబాబు, కందుకూరు టౌన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం శ్రీనివాసులు, కందుకూరు డివిజన్ పరిధిలోని ఏఈలు మధుబాబు, రమేష్ బాబు, ఫిరోజ్, కోటయ్య, నరసింహం, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరయ్య




అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు:ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కందుకూరు తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం హాకీ బాలుర, బాలికల, అథ్లెటిక్స్ బాలుర ,బాలికల జట్ల ఎంపికలు జరిగింది. ఈ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా హాకీ క్రీడకు సుమారు 50 మంది విద్యార్థులు అథ్లెటిక్స్ కి సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హాకీ జట్లకు ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నం నక్కపల్లిలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో ఈనెల 30, 31 జనవరి1 తేదీలలో జరుగు పోటీలను పాల్గొంటారు. అథ్లెటిక్స్ జట్లు త్వరలో శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ ఎంపిక కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 జిల్లా కార్యదర్శి ఎం.ఆదినారాయణ రావు, టిఆర్ఎస్ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తొట్టెంపూడి సుబ్బారావు, కంభం జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మురళి, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

వధూవరులకు ఇంటూరి ఆశీర్వాదం

ప్రజాశక్తి-ఉలవపాడు:మండలంలోని కొల్లూరుపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు అమ్మనబ్రోలు మాధవ, శ్రీదేవి దంపతుల కుమారుడు వంశీకష్ణ, గాయత్రి వివాహం శుక్రవారం జరిగింది. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట స్థానిక నాయకులు మర్రిపోయిన శ్రీహరి, రాచగర్ల శివ, అమరనేని రాములు, ఇతర నాయకులు నాగేశ్వరరావులు ఉన్నారు.

గుడ్లూరులో చిరుజల్లులు

ప్రజాశక్తి-గుడ్లూరు:మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచే చలిగాలులు వీచాయి. ఈ చలిగాలుల మధ్య చిరుజల్లులు కురిశాయి. ఈ తుపాను ప్రభావంతో వద్ధులు, చిన్నారులు ఇబ్బందులకు గురయ్యారు. మరోపక్క పత్తి రైతులకు విత్తనాలు విత్తుకునేందుకుగాను ఈ వర్షం అడ్డంకిగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాన్ సముద్రతీర ప్రాంతాలైన ఆవులు వారి పాలెం, మొండి వారి పాలెం , సాలిపేట, కర్లపాలెం గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని మండల స్థాయి అధికారులు తెలియజేశారు. తుపాను ప్రభావంతో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే అధికారి యంత్రాంగానికి తెలియజేయాలని అధికారులు కోరారు.

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ఉలవపాడు:సిఐటియు జిల్లా 11వ మహాసభలు ఈనెల11, 12 తేదీల్లో ఆత్మకూరు పట్ట ణ ంలో జరుగుతున్నాయి. ఈ మహాసభల సందర్భంగా 11న ఆదివారం ఆత్మకూరుకు బహిరంగ సభల ర్యాలీకి వెళ్లుటకు ఉలవపాడు నుంచి ఉదయం10గంటలకు బస్సు ఏర్పాటు చేశారు. బహిరంగసభకు మండలంలోని ప్రజాసం ఘాల కార్యకర్తలందరూ హాజరు కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జివివి కుమార్ కోరారు.



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పాఠ్యపుస్తకాలు అందించాలి

ప్రజాశక్తి-కందుకూరు:స్థానిక టి.ఆర్.ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మెండా. శ్రీహర్ష పాల్గొని మాట్లాడుతూ దాదాపు కాలేజీ మొదలయ్యి నాలుగు నెలలు కావస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించక పోవడం దుర్మార్గమన్నారు. పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని చెప్పడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. అకాడమిక్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, మార్చిలో పబ్లిక్ ఎగ్జామ్స్ జరుగుతాయని తెలిపారు. మరి పాఠ్యపుస్తకాలు అందించకపోతే విద్యార్థులు ఎలా పరీక్షలకు సిద్ధమవుతారని ప్రశ్నించారు. దీనిని దష్టిలో ఉంచుకొని విద్యార్థుల భవిష్యత్తుని ఆలోచించి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకి వెంటనే పాఠ్యపుస్తకాలు అందించా లన్నారు. అందించకపోతే ఈ ఉద్యమం ఉధతం చేస్తామన్నారు. విద్యార్థులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షులు రాజకు మార్, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్న సిపిఐ

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :టిడ్కో గృహాలు, జగనన్న కాలనీ వెంటనే ఇవ్వాలని లబ్ధిదారులతో కలిసి సిపిఐ నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయినటువంటి టిడ్కో గహాలు వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్న గృహాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. గృహాలు ఇచ్చినచోట మౌలిక సదుపాయాలు లేవన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ, నీళ్ల సదుపాయం, చెత్తాచెదారం, రోడ్లు గుంటలు, పందుల సంచారం ఇలా ఎన్నో సమస్యలతో కూడినటువంటి టిడ్కో గృహాలు ఉన్నాయన్నారు. జగనన్న కాలనీ చూస్తే ఆరు అంకణాల స్థలానికి 1,80,000 కేటాయించడం సరిపోదు సౌకర్యాలు ఉండవు ఇంటికి ఐదు లక్షలు ఇవ్వాలని మా ప్రధానమైనటువంటి డిమాండ్ అన్నారు. సమస్యలను పూర్తి చేయకపోతే నిత్యం పోరాటలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ అరిగేలా నాగేంద్ర సాయి, సయ్యద్ సిరాజ్, షానవాజ్, రమణయ్య అజీజ్, మున్నా, వాహనాల మధు, లతీఫ్, గౌస్, ఎన్ మధు, ఫైరోజ్, ఆబిద్, స్టాలిన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు:క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో పెద్దఎత్తున క్రీడల అభివద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను జెడ్‌పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా రూ. 50 లక్షల ప్రైజ్ మనీ ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించేలా క్రీడా సంబరాలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర సాంస్కృతిక, క్రీడల శాఖ మంత్రి రోజాను అభినందించారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రూ.50 లక్షల నగదు బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ఔత్సాహికులైన క్రీడాకారులను గుర్తించి మెరుగైన క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రి, జెడ్‌పి చైర్‌పర్సన్, మేయర్ బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో సెట్నల్ సిఇఒ పుల్లయ్య, చీఫ్ కోచ్ యతిరాజ్, జెడ్‌పి సిఇఒ చిరంజీవి, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, పిఇటి అసోసియేషన్ అధ్యక్షులు హరికష్ణ, బ్యాడ్మింటన్ కోచ్ భాస్కర్ పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

తుపాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :మాండూస్ తుపాను నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ కెవిఎన్ చక్రదర్‌బాబు, ఎస్‌పి సిహెచ్ విజయరావు, పలువురు జిల్లా అధికారులతో మంత్రి మాండోస్ తుపాను సహాయక చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో మాండోస్ తుపాను నేపథ్యంలో కలెక్టర్, ఎస్‌పి సంబంధిత అధికారులు అందరూ ఎటువంటి పరిస్థితులైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉన్నారని అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు ఇప్పటికే చేపట్టారని వివరించారు. ముఖ్యంగా మత్స్యకారులు చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లకుండా ఇప్పటికే వారిని అప్రమత్తం చేశామన్నారు. చేపల వేటకు వెళ్లిన వారిని తిరిగి రప్పించడం జరిగిందని చెప్పారు. తుపాను షెల్టర్లు, పునరావాస కేంద్రాలను గుర్తించామన్నారు.జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే నివారించడానికి మండలాల్లో ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. జిల్లా కేంద్రంలో 1077 టోల్ ఫ్రీ నెంబర్ తో కంట్రోల్ విభాగం మూడు రోజుల నుండి పనిచేస్తుందని అన్ని ప్రభుత్వ శాఖల నుండి తాజా సమా చారాన్ని ఎప్పటికప్పుడు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో గత 24 గంటలుగా వర్షం కురుస్తోందని సరాసరి 2 మిమి వర్షపాతం నమోదైందన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ రోనంకి కూర్మానాద్, నగర కమిషనర్ డి హరిత, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, అదనపు ఎస్పీలు హిమవతి, శ్రీనివాసరావు, డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు మలోల, శినా నాయక్, కరుణకుమారి, తెలుగు గంగ ప్రాజెక్టు సీఈ హరి నారాయణరెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పెంచలయ్య, జెడ్ పి సిఇఒ చిరంజీవి, డిఎస్ఒ వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

ఆస్పత్రి అభివృద్ధి అందరి బాధ్యత

ప్రజాశక్తి-కందుకూరు:స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివద్ధి బాధ్యత ప్రజలందరిపై ఉందని శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం మహీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు తెలియజేయాలని కోరారు. చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో చూపించే విధంగా వార్తలు రాసి ఆసుపత్రి పై ప్రజల్లో అపనమ్మకం కలిగించొద్దని కోరారు. ఆస్పత్రి నిధులు వివరాలపై చర్చించి అవసరమైన వాటికి సమావేశంలో కేటాయించామన్నారు. డాక్టర్లు, సిబ్బందితోపాటు ప్రజలు భాగస్వాములై ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శకుంతల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ

నిత్యావసరాలు అందజేత



ప్రజాశక్తి-కావలి : స్థానిక వెంగళరావు నగర్లో ఉన్న సంయుక్త సేవాసంస్థ ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శుక్రవారం 18 మంది పేద పిల్లలకు విద్య వైద్యం సంరక్షణ విభాగం ద్వారా నెలకు సరిపడా నిత్యావసరాలు, బియ్యం, పోస్టాఫీసులో ప్రతినెలా రూ.1000 డిపాజిట్ చేస్తున్న పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్.పి.పద్మజ విచ్చేసి పేద పిల్లలకు నిత్యావసర వస్తువులు బియ్యం పోస్టాఫీసు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో పేద పిల్లలకు విద్య వైద్యం సంరక్షణ విభాగం ఏర్పాటు చేసి, ఈ విభాగం ద్వారా తల్లి తండ్రులు ఇద్దరూ లేదా ఒకరు లేనిపిల్లలను అక్కున చేర్చుకుని ప్రతినెలా వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తూ పిల్లల భవిష్యత్తును అందిస్తున్న దాతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. దీనిలో తానూ భాగస్వామిని కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఇటువంటి వారిని గుర్తించి దాతలకు తెలియజేసి వారి ద్వారా పేదపిల్లలకు సహాయం అందజేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. అలాగే ఈ పేద పిల్లలలో శివనాగేశ్వరి పుట్టినరోజు కావడంతో నూతన వస్త్రాలు తీసిచ్చి, కేక్ కట్‌చేసి ఘనంగా అందరి మధ్య పుట్టినరోజు జరపటం చాలా గొప్ప విషయమని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, కుట్టు శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : 2023 నూతన సంవత్సరం, సంక్రాంతి, క్రిస్మస్ పండుగల శుభాకాంక్షలు తెలియజేస్తూ సర్వజనులకు శుభం కలగాలని ఆకాంక్షిస్తూ, మతసామరస్యం వర్ధిల్లాలి అనే ఆకాంక్షతో ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని మదీనా జ్యువలర్స్ షాపు యజమాని పి.యస్దాని బాషా మూడు మతాలకు సంబంధించిన క్యాలెండర్లు ముద్రించి జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు అధికారి హమీద్ చేతులమీదగా శుక్రవారం మెయిన్ బజార్‌లో ఆవిష్కరించారు. 10 సంవత్సరాల బంగారు వెండి ఆభరణాల తయారీ రంగంలో 18 సంవత్సరాల బంగారు ఆభరణాల వ్యాపార రంగంలో ఆత్మకూరు నియోజకవర్గ నలుమూలల ప్రజల ఆశీస్సులు పొందుతూ అభిమానాన్ని చురగొన్న మా మదీనా జ్యువలర్స్‌ను మరింత ఆదరించి ప్రోత్సహించాలని కోరుకుంటున్నానని యస్దాని తెలిపారు.

వాహనాలు తనిఖీ



ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సెంటర్లో ఉదయగిరి సిఐ వి.గిరిబాబు, ఎస్ఐ మహేంద్ర నాయక్‌లు శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ మధ్య కాలంలో దుత్తలూరులో జరిగిన బాలిక కిడ్నాప్ తర్వాత పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సిఐ వి.గిరిబాబు మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పలు వాహనదారులకు లైసెన్స్ లేకపోవడం హెల్మెట్ ధరించకపోవడం సరైన వాహనాల పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించి కేసు బుక్ చేసినట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు తమ వద్ద సరైన పత్రాలు కలిగి ఉండాలని లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

'పిఎం మాతృత్వ స్పందన యోజన'

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులైన మహిళలకు ప్రతి నెల 9వ తేదీ జరిగే ప్రధానమంత్రి మాతృత్వ స్పందన యోజన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కరిష్మా మాట్లాడుతూ గర్భిణులైన మహిళలు మంచి ఆహారం తీసుకోవాలని ప్రతినెలా చెకప్‌లు చేయించుకుంటూ డాక్టర్ల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే పోషకాహారం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎం సుశీలమ్మ, ఆరోగ్య మిత్ర నవమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలో ఇన్వర్టర్ ఏర్పాటు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : స్థానిక కస్తూర్బా పాఠశాలలోని పిల్లల సౌకర్యార్థం శుక్రవారం ఎంపిపి పద్మజారెడ్డి ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎల్ఎ విక్రమ్ రెడ్డి పాఠశాలకు వచ్చినప్పుడు సమస్యను ఎంఎల్ఎ దృష్టికి తీసుకు రాగా, ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. అందువల్ల పాఠశాలలో ఇన్వర్టర్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీ లక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి : స్థానిక అరుంధతీయ పాలెంకు చెందిన గడ్డం వెంకటరమణ, వెంకటమ్మల కుమార్తె శశి వివాహానికి శుక్రవారం మన ఫౌండేషన్ సభ్యులు రూ.10వేల పెళ్లి కానుకను అందించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మన ఫౌండేషన్ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు ఈ పెళ్లి కానుక అందజేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మన ఫౌండేషన్ సేవలను నియోజకవర్గంలోని 143 పంచాయతీలలో విస్తరిస్తున్నట్లు చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు రంతుజాని, గాజుల బాబు, బాబు హైరర్స్, వెంగయ్య, గంగిరెడ్డి, చిన్నయ్య, మున్నా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ



ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక ప్రశాంతి నగర్ బ్రహ్మానందపురంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్లో స్టేట్ లెవెల్‌లో జరిగిన సిబిఎస్‌సి ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులకు శిక్షణిచ్చారు. వారిని పోటీలలో పాల్గొనేందుకు సహాయ సహకారాలు అందించిన ఉపాధ్యాయులకు పార్టీ పిటిషన్ సర్టిఫికెట్స్, సీడల్ బహూకరించిన ఆయా విద్యార్థులను స్కూల్ యాజమాన్యం ప్రోత్సహించింది. స్కూల్ అకాడమిక్ డీన్ కళా కష్ణ స్వామి, కరస్పాండెంట్ పెనుబల్లి కష్ణ చైతన్య, ప్రిన్సిపల్ మనుబోలు సుబ్బరాయుడు, విద్యార్థులకు షీల్డ్, సర్టిఫికెట్స్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ జవాన్ మృతి

ప్రజాశక్తి-సీతారామపురం : బైక్ అదుపుతప్పి రిటైర్డ్ ఆర్మీ జవాను తోట మల్లికార్జున(40) మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని దేవిశెట్టిపల్లి గ్రామ సమీపాన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మృతుడు శుక్రవారం ఉదయం మద్యం సేవించి సీతారామపురం నుండి స్వగ్రామమైన దేవి శెట్టిపల్లికి తిరిగి తన మోటార్ సైకిల్‌పై వస్తున్న తరుణంలో నాగరాజుపల్లి, దేవిశెట్టిపల్లి మార్గమధ్యంలో గల మలుపు వద్ద అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న గుంతలో పడి మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు చిన్నారులున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.కిషోర్ బాబు తెలిపారు.

సైడు కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నెల్లూరు : సైడ్ కాలువలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పట్టణంలోని 11వ డివిజన్ ఎన్‌టిఆర్ నగర్ వెంగమాంబ లేఅవుట్ నాలుగో వీధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. నెల్లూరు శెట్టిగుంట రోడ్డు ప్రాంతంలో నివాసం ఉంటున్న చెంచు.గోపాల్ (42) ఎన్.టి.అర్ నగర్‌లో ఓ క్యాటరింగ్‌లో సప్లయ్ పని నిమిత్తం వచ్చి ఉన్నాడు.దుకాణం షాప్‌కి అని చెప్పి వచ్చాడు. తీరా చూస్తే కాలువలో పడి చనిపోయాడు.ఆ రోడ్డులో వెళుతున్న వారు 108 ఫోన్, 6వ నగర పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలంకు ఎస్ఐ బొజ్జ నాయక్ చేరుకొని వారి బంధువులకు సమాచారం తెలిపారు.బంధువులు మతినికి కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నాయని పోలీసులక తెలిపారు.పోలీసులు బాడీనీపోస్టుమార్టం జిజిహెచ్‌కు తరలించి పూర్తి వివరాలు సేకరస్తున్నారు.

శ్రమజీవుల కోసం పోరాడేదే 'సిఐటియు'

- సిఐటియు జిల్లా మహాసభల సాంస్కృతిక కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌బాబు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

కార్మికులు, కర్షకులు, శ్రమ జీవుల కోసం అనేక పోరాటాలు చేసి ఎంతో మంది ప్రాణాలు అర్పించి పేద బడుగు బలహీన వర్గాల కోసం జీవితాలు త్యాగం చేసిన గొప్ప చరిత్ర సిఐటియు యూనియన్‌ది అని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు తెలియజేశారు. శుక్రవారం జిల్లా 11వ మహాసభల అధ్యక్షుడు జి.శివప్రసాద్ అధ్యక్షతన సాంస్కృతిక కార్యక్రమాలను త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసి గత రెండు నెలల నుండి ఈ సిఐటియు జిల్లా మహాసభల జయప్రదం కోసంగా కృషి చేస్తున్న అనేకమంది కార్యకర్తలకు సహకరించిన దాతలు విరాళాలు ఇచ్చి ప్రోత్సహించిన దాతలకు అదేవిధంగా పిల్లలను మహాసభల సందర్భంగా ప్రతిభ పురస్కారాలు కొన్ని స్కూల్లో ఎస్సే రైటింగ్ చిత్రలేఖనం వక్తృత్వ పోటీలు, పాటల పోటీలు, స్కూల్ లెవెల్‌లో కూడా నిర్వహిం చారు. స్కూల్ లెవెల్‌లో ఫస్ట్, సెకండ్, థర్డ్, వచ్చిన పిల్లలందరినీ మండలంలో నిర్వహిం చి మండల స్థాయిలో కూడా ఫస్ట్, సెకండ్, థర్డ్ వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపిపి కేత వేణు గోపాల్‌రెడ్డి మాట్లా డుతూ ఆత్మకూరు లో సిఐటియు జిల్లా మహా సభలు జరగడం గర్వంగా చెప్పుకొని, సిఐటియు నాయకులకు స్వాగతం పలుకుతున్న ట్లు ఆయన తెలియ జేశారు. రాష్ట్రంలోనే సిఐటియు పెద్ద యూనియన్ అని, శ్రమ జీవుల కోసం నిత్యం పోరాడుతుందన్నారు. మున్సి పల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్ మాట్లాడుతూ సిఐటియు కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి వారి హక్కుల సాధించి పెడుతుందన్నారు. జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ ఆదిమ కాలం నుండి ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాల రూపంలో ప్రజా నాట్య మండలి వచ్చిందని తెలిపారు. ప్రజా కళలు విపరీతంగా అభివృద్ధి చెందుతున్నా యన్నారు. ప్రజా కళాకారుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. సారాయి ఉద్యమంలో అద్భుతమైన పాటలను రాసి ఉద్యమాన్ని తిరగ రాసిన ప్రజానాట్యమండలి అని కొనియాడారు. ఆ పాటలతో ప్రజల్లో చైతన్య వచ్చి మహిళలు తిరగబడి సారాయి ఉద్యమాన్ని చేపట్టిన చరిత్ర ప్రజానాట్య మండలికి ఉందన్నారు. ప్రజానాట్యమండలి నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు కళాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ సిఐటియు నాయకులు, విద్యార్థులకు ప్రజాసంఘాల నాయకులకు ముందుగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి తుపాన్‌లో కూడా ఈ ప్రోగ్రాం సక్సెస్ చేసినందుకు శ్రామిక మహిళ గుల్జాబేగం ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ పోటీలు గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. ఈ ప్రతిభ పోటీలలో పాటల పోటీలు, గ్రూప్ సాంగ్స్ నృత్య పోటీలలో జెడ్‌పి బాలిక ఉన్నత పాఠశాల, జెడ్‌పి వెస్ట్ హై స్కూల్, ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, జెడ్‌పి బట్టేపాడు హై స్కూల్, కరటంపాడు జెడ్‌పి హైస్కూల్‌పై ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని బహుమతులు అందుకున్నారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్‌ను, ఎంపిపి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సిఐటియు మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, యుటిఎఫ్ నాయకులు శివయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, ఎం.నాగేంద్ర, జెవివి నాయకులు హరికృష్ణ, మల్లి, ప్రజానాట్య మండలి కళాకారులు కేశవులు, షకూర్, బల్లి బాబు, గద్దర్ బాబు, బాలాజీ తదితరులున్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న నాగ నందిత



కరపత్రాలను చూపుతున్న సిఐటియు నాయకులు

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కావలి

జిల్లా సిఐటియు 11వ మహాసభలను జయప్రదం చేయాలని శుక్రవారం సిఐటియు నాయకులు పట్టణంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి యర్రంశెట్టి కృష్ణమోహన్ మాట్లాడుతూ జిల్లాలో సిఐటియు ప్రధానమైన అతిపెద్ద సంఘంగా 40 వేల సభ్యత్వం కలిగి ఉందన్నారు. 11, 12 తేదీలలో ఆత్మకూరు పట్టణంలో జరిగే సిఐటియు జిల్లా 11వ మహాసభలకు కార్మికులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.పెంచల నరసింహం, బి.కృష్ణయ్య, బిరదల మహేష్, శివకోటయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు : సిఐటియు నెల్లూరు జిల్లా 11వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున శుక్రవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కోరారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు మునిర్ అహమ్మద్, నాయకులు షేక్ జానీ భాష, పోతంశెట్టి శ్రీనివాసులు, పులి మల్లయ్య పాల్గొన్నారు.

టిడ్కోగృహాల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్



టిడ్కో గృహాలను లబ్ధిదారులకు వెంటనే అందించాలని, జగనన్న కాలనీలకు మంజూరు చేసిన రూ.1,80,000లను రూ.5లక్షలకు పెంచాలని సిపిఐ నాయకులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన టిడ్కో గృహాలను వైసిపి అధికారంలోకి వచ్చి దాదాపు మూడున్నర సంవత్సరాలు అవుతున్నా గృహాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వలేదని తెలిపారు. గృహాలు ఇచ్చినచోట మౌలిక సదుపాయాలు లేవని, డ్రెయినేజీ వ్యవస్థ, నీళ్ల సదుపాయం, చెత్తాచెదారం, రోడ్లు గుంటలు, పందుల సంచారం ఇలా ఎన్నో సమస్యలతో కూడినటువంటి టిడ్కో గృహాలు ఉన్నాయన్నారు. జగనన్న కాలనీలు చూస్తే ఆరు అంకణాల స్థలానికి రూ.1,80,000 కేటాయించడం సరిపోదనీ, పెరిగిన ధరలకు అనుకూలంగా ఒక్కో గృహానికి కనీసం రూ.5లక్షలు మంజూరు చేస్తే గానీ గృహ నిర్మాణం సాధ్యం కాదని తెలిపారు. సమస్యలు పరిష్కరించని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ నాయకులు నారాయణ, శేషాద్రి, నాయబ్ భాషా, బ్రహ్మానంద రెడ్డి, గోపాల్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



ప్రజాశక్తి-కావలి : శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్ మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో మానవహక్కుల, వినియోగ దారుల ఫోరమ్ నెల్లూరు జిల్లా ప్రెసిడెంట్ పైడి కాంతారావు హక్కులు ఉల్లంఘన గురించి ఆయన వారి గురించి సమాచార హక్కులు తిరస్కరించడం, మహిళల పై వివక్షత, శిశు హత్య మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి బి.మోహనరావు జాతీయ మానవహక్కుల కమిషన్ ఏర్పాటు, మానవహక్కుల సంఘం అధికారులు విధులను గురించి అవగాహనా కలిగించారు.కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.రావు, డాక్టర్ ఎం.రవికాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సాయితేజ, కామర్స్ అధ్యాపకులు మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

హరించుకుపోతున్న మానవ హక్కులు

ప్రజాశక్తి-కావలి : నానాటికీ పెరుగుతున్న జనాభా లెక్కల ప్రకారం అణగారిన వర్గాల ప్రజలు తమ హక్కులను వినియోగించు లేక పోతున్నారని మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సామాజిక కార్యకర్త, న్యాయవాది ఐ.సాయి ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. దీనికి కారణంగా నానాటికీ పెరుగుతున్న అవినీతి, స్వచ్ఛమైన పరిపాలన లేక పోవుట, క్రమశిక్షణ కొరవడం, క్రియాశీలక నిర్ణయాలు తీసుకులేకపోవడం, వల్లే హక్కులు హరించుకుపోతున్నాయని తెలిపా. అవినీతి అరాచక శక్తుల నుండి కాపాడి మెరుగైన సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సముద్ర తీరం వద్ద భద్రతా ఏర్పాట్లు



ప్రజాశక్తి-అల్లూరు : మాండూస్ తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పు గోగులపల్లి సచివాలయాన్ని సందర్శించారు. తుపాన్ సంభవిస్తే వచ్చే నష్టాలు అలాగే తదుపరి చర్యలపై అధికారులతో అనేక విషయాలను కూలంకుశంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది వారి కార్యాలయాలలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తుపాన్ తాకిడికి రోడ్లపై నీరు నిలిచినా అలాగే చెట్లు విరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడినా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ల వద్ద నీరు నిలిస్తే తక్షణమే స్పందించాలని అధికారులను కోరారు. శని, ఆదివారాలలో ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేకుండా సెలవులు రద్దు చేసినట్లు ఆదేశాలు జారీ చేశామన్నారు. మండల స్థాయి కంట్రోల్ రూమ్ ఇంచార్జిగా నాగరాజు నియమించామని ఎప్పటికప్పుడు సమాచారం ఫోన్ నెంబర్ 9908566319 కు అందించాలని తెలిపారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని సూచించారు. ఇఒపిఆర్‌డి పెంచల వీరేంద్ర, తదితరులున్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : మాండూస్ తుఫాన్ కారణంగా శుక్రవారం నుండి వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి వెంకట్రావు పేర్కొన్నారు. బోగోలు మండలం సముద్ర తీర ప్రాంతాలను మండల ప్రత్యేక అధికారి వెంకట్రావు తహశీల్దార్ లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించి గ్రామస్తులతో తుపాన్‌కు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతంలో నివసిస్తున్న వారు సముద్రం వేటకు వెళ్లరదని, తీర ప్రాంతం వాసులు తల దాకునేందుకు తుఫాన్ షెల్టర్‌లో ఉండవచ్చని, వారికి కావాల్సిన అన్ని సదుపాయాలను గ్రామాలలో నియమించిన ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కి తెలియజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుపాను కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా గ్రామాలలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుకోసం ప్రత్యేక అధికారులను నియమించామని, అత్యవసరమైతే ప్రజలు గ్రామాల్లో నియమించిన ప్రత్యేక అధికారులకు గానీ తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ మనోహర్, అల్లిమడుగు విఆర్ఒ సతీష్, గ్రామస్తులు, తదితరులున్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మాండూస్ తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా వర్షం పడుతుంది. రోడ్లు జలమయమయ్యాయి. చలి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. విస్తారంగా వర్షాలు పడుతుండడం వల్ల తహశీల్దార్ హేమంత్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మాండూస్ తుఫాన్ ప్రభావంతో మండలంలోని మైపాడు సముద్ర ప్రాంతం అల్లకల్లోలంగా ఉండడంతో ఎస్ఐ వాసు సముద్ర తీర ప్రాంతం వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. అదేవిధంగా మత్స్యకారులు బోట్లను, వలలను సురక్షిత ప్రాంతాలను తరలించారు. ఈ సందర్భంగా పర్యటకులను, మత్స్యకారులను ఆయన అప్రమత్తం చేస్తూ యాత్రికులకు కౌన్సిలింగ్ ఇచ్చి వెనక్కి పంపించే ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉందని యాత్రికులు మైపాడు బీచ్ వద్దకు రావద్దని తమ నివాసాల్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మాండూస్ తుపాన్‌ను విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని తహశీల్దార్ హమీద్ సూచించారు. శుక్రవారం అయన మాట్లాడుతూ బంగాళా ఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మాండూస్ తుపానుగా మారి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలన్నారు. తుపాన్ ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని చెప్పారు. అంతేకాక అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఈ మేరకు విఆర్ఒలను హెడ్ క్వార్టర్లలో ఉండాలని సూచించారు. కోడూరు, వెంకన్నపాలెం, కాటేపల్లి సముద్ర తీర ప్రాంతాల్లో విఆర్ఒలు సిద్ధంగా ఉన్నారన్నారు. అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందు బాటులో ఉంచామని తెలిపారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇం దుకోసం 16 సైక్లోన్ షెల్టర్లను, రెండు హైస్కూళ్లను సిద్ధం చేసి ఉంచామని పేర్కొన్నారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లో చేపల వేటకు సముద్రం లోకి వెళ్లొద్దని సూచించారు.

పందులను దూరప్రాంతాలకు తరలించాలి

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలో సంచరిస్తున్న పందులను తరలించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు పందుల నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పందుల పెంపకం దారులతో మాట్లాడారు. పట్టణంలో అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో వాటి సంరక్షణకు ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించిన ఉన్నారని తెలిపారు. ఆ ప్రాంతంలో కంచే ఏర్పాటు చేసుకొని వెంటనే పందులను తరలించేలా చర్యలు చేపట్టాలని వారికి సూచించారు.

'ఆశా' పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-ఉదయగిరి

గండిపాలెం పిహెచ్‌సి పరిధిలోని మూడు ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి శివకుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ప్రకటనలో తెలుపుతూ మండల పరిధిలోని, గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న నేలటూరు, ఉదయగిరి బిట్-1, బిట్-2 సచివాలయాల్లో 3 ఆశా కార్యకర్తల నియామకానికి దరఖాస్తులను అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆఖరి తేదీ 10 శనివారం కావున అసక్తగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హతలు సొంత గ్రామ కోడలు అయి ఉండి వయస్సు 25 నుండి 45 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పెళ్లి అయి భర్త చనిపోయి ఉండి దూరమైన వారు కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలన్నారు. పూర్తి చేసిన అప్లికేషన్లను 10వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోపు ఉదయగిరి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్ 9989120793ను సంప్రదించాలన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి



కావలి పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవియర్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ (టీం సేవియర్స్) ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్‌క్రాస్ రక్తకేంద్రం, విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఏకకాలంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలల విద్యార్థులు, రెడ్‌క్రాస్, యోగకేంద్రం శిక్షార్థులు కూడా రక్తదానం చేశారు. సాయంత్రానికి 370 మందికి పైగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ నళిని పద్మ, హరినారప రెడ్డి, యోగ శిక్షకులు జనార్ధన్ గురూజీ, రెడ్‌క్రాస్ చైర్మన్ రవి ప్రకాష్, సెక్రటరీ గంధం ప్రసన్నాంజనేయులు, రెడ్‌క్రాస్ కార్యనిర్వాహాధికారి బి.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొని శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రణీత్ మాట్లాడుతూ తుపాను హెచ్చరికలున్నప్పటికీ, వాతావరణం సహకరించక పోయినా సుమారుగా 370 మందికిపైగా తమ పిలుపునకు స్పందించి రక్తదానం చేసినందుకు రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సేవియర్ సభ్యులు మాధురి, కీర్తి, దీపిక, నవ్య, మాన్యజాహ్నవి, కరిష్మా, స్వాతి, శ్రావణి, లిఖిత, హర్ష, వినీల్, రమణ్, శ్రీను, కౌశిక్, భార్గవ్, నాగేంద్ర, పవన్ సాయి, రాజేష్, నవీన్, దీపక్, తరుణ్, కౌషిక్, సుజిత్, పవన్ కుమార్, చైతన్య, మనీష్, పవన్, కళ్యాణ్, తౌహీద్, షోయబ్, తదితరులున్నారు.

జంప్‌రోప్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కలిగిరి



రాష్ట్ర స్థాయిలో నిర్వహించే జంప్‌రోప్ పోటీలకు కలిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ మురళి తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 10, 11 తేదీలలో నంద్యాలలో జరుగనున్న రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీలకు తమ స్కూల్ విద్యార్థులు అర్హత సాధించడం గొప్ప విషయమన్నారు. అంతేగాక జిల్లా స్థాయిలో తమ పాఠశాలకు గర్వకారణంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలను సాధించడంతో పాటు క్రీడా రంగంలోనూ రాణిస్తున్న వైనం కలిగిరి మండల కీర్తి ప్రతిష్టలను నలుదిశలా విస్తరింపజేస్తున్నారన్నారు. కాగా ఈ పోటీలకు శ్రావణి, సంగీత, భార్గవ్ రామ్, అన్వేష్, మాధురి, కల్పనలు ఎంపికయారన్నారు. నంద్యాలలోనూ విజయ పరంపర సాగించనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించడంతో సహా గెలుపే లక్ష్యంగా మరింతగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

సిఎంకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కందుకూరు



కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి కషి ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు వారి అటెండెంట్‌ల మెస్ డైట్ ఛార్జీలు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు నెలల క్రితం కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశానికి హాజరైన మహీధర్ రెడ్డి విలేకరుల కోరిక మేరకు ఆస్పత్రిలో రోగులకు పెడుతున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. భోజనం అంత నాణ్యంగా లేదు. విషయం అక్కడ ఉన్న డాక్టర్లు ,సిబ్బందిని ఆయన అడిగారు. సార్ రోజుకు ఒక్క రోగికి రూ.40 ప్రభుత్వం ఇస్తుంది. దాంతో డైట్ కాంట్రాక్టర్ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టాల్సి వస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని మహీధర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకు వెళ్లడంతో ఛార్జీలు 100శాతం పెంచుతూ జిఒ ఇచ్చారని శుక్రవారం విలేకరులకు చెప్పారు. ప్రస్తుతం ఉన్న నిత్యావసర వస్తువుల ధరలతో రోజుకు 45 రూపాయలతో నాణ్యమైన పోషక ఆహారం అందించటం కష్టమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక రోజుకి రూ.40 దానిని 80 రూపాయలకు పెంచారు. మెంటల్,టిబి రోగులకు గతంలో రూ.56 ఇస్తుండగా 80 రూపాయలకు పెంచారని చెప్పారు. డ్యూటీ డాక్టర్లకు గతంలో రూ.80 ఇస్తుండగా దానిని వందకి పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. సిఎంకి మహీధర్‌రెడ్డి కృతజ్ఞతలు చెప్పారు.

జాతీయ రహదారి మార్పుల కోసం ప్రయత్నాలు:ఎంఎల్ఎ

167 జాతీయ రహదారి నిర్మాణ పనులు మార్పుల కోసం నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి ద్వారా ప్రయత్నిస్తున్నట్లు మహీధర్ రెడ్డి చెప్పారు. ప్రస్తుతం పట్టణంలోని సిటిఆర్ఐ మధ్యలో జాతీయ రహదారి నిర్మాణ పనులు చేయాలని అలైన్మెంట్ రూపొందించారు. దీంతో సిటీఆర్ఐకి ఇబ్బంది కరంగా ఉందని వారి ద్వారా వచ్చిన అభ్యర్థనను దష్టిలో పెట్టుకొని దాని మార్పు కోసం నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి ద్వారా ప్రయత్నం ప్రారంభించాలని చెప్పారు. సింగరాయకొండ నుంచి చెర్లోపాలెం వరకు జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా నిర్మిస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చు అనే ఉద్దేశంతో ప్రతిపాదనను కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ ఘడ్కరికి అందజేసినట్లు చెప్పారు. మాలకొండ వద్ద నుంచి సింగరాయకొండ వరకు జరిగే జాతీయ రహదారి పనులను మూడు లైన్లతో నిర్మించాలని మంజూరు చేశారు. సింగరాయకొండ నుంచి కందుకూరు వరకు ట్రాఫిక్ అధికంగా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయనే ఉద్దేశంతో నాలుగు లైన్లు నిర్మించమని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ద్వారా మహీధర్ రెడ్డి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ప్రయత్నాలు ఫలిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు.